## కోల్ బెల్ట్ వ్యాప్తంగా 'బీఆర్ఎస్'ను గెలిపించుకుంటం

- 11 మంది అభ్యర్థుల విజయం ఖాయం..
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య స్పష్టం



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య

గోదావరిఖని, అక్టోబర్ 28ః వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 11 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలని తీర్మానం చేసినట్లు టీబీజీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ.వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తెలిపారు. గోదావరిఖని సాయిలీలా రెసిడెన్సీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కోలిండియాలో లేని అనేక సమస్యలు, డిమాండ్లను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రిటైర్మెంట్ వయస్సును 61 ఏండ్లకు పెంచడం, 32 శాతం లాభాల వాటా చెల్లించడం ఇతర అనేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్మికులు, ప్రజలు సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవడానికి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఆర్జీ–1లో నిర్వహించిన తరహాలోనే శ్రీరాంపూర్, భూపాలపల్లి ఏరియాల్లో కూడా సమావేశాలు నిర్వహించి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు నూనె కొంరయ్య ఉన్నారు.

# ప్రమాదరహిత సింగరేణియే లక్ష్యం

- రక్షణ సూత్రాలపై నిర్లక్ష్యం వద్దు
- ఎస్‌వోటూ డైరెక్టర్ (ఆపరేషన్) లలిత్ కుమార్



యైటింక్లయిన్ కాలనీ: రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కాసిపేట : 2 ఇంక్లైన్ గనిపై బహుమతులు అందిస్తున్న అధికారులు

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 28: ప్రమాదరహిత సింగరేణియే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఎస్‌వోటూ డైరెక్టర్ (ఆపరేషన్) డీ లలిత్ కుమార్ ఉద్యోగులకు సూచించారు. 54వ వార్షిక భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్జీ–2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్. సాంబయ్యతో కలిసి భద్రతా కమిటీ కన్వీనర్ లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గని పరిసరాలు, గనిలో చేపడుతున్న రక్షణ చర్యల అమలు, పని స్థలాలను పరిశీలించి ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. భూగర్భగనుల్లో వకీలుపల్లి గని నూరు శాతం ఉత్పత్తి సాధించడం అభినందనీయమన్నారు. పై అధికారులు, సీనియర్ ఉద్యోగులు చెప్పే ప్రతి అంశాన్ని అమలు చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు బీ. శ్రీనివాస్, రామకృష్ణ, సదానందం, అబ్దుల్ నబీ, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణప్రసాద్, వై. శ్రీనివాస్, సురేశ్, పృథ్వీ, మేనేజర్ పీ. రవికిరణ్, రక్షణాధికారి రవీందర్, సంక్షేమాధికారి ఓంకారి బాబు పాల్గొన్నారు

### రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట, అక్టోబర్ 28 : రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ జి నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై 54వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ముందుగా కారొర్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఏరియా జీఎం మనోహర్, రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తాతో కలిసి సేఫ్టీ కమిటీ కన్వీనర్ నాగేశ్వర్‌రావు గనిని తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా కన్వీనర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, సేఫ్టీ జీఎంను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేసే పద్ధతిని రెస్క్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. భద్రతా వారోత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. భద్రతకు సంబంధించి లఘు నాటిక ప్రదర్శించారు. సేఫ్టీ కమిటీ కో కన్వీనర్లు ప్రవీణ్ విక్రం, సాయినాథ్, ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏరియా రక్షణాధికారి రవీందర్, ఇంజినీర్ రాంప్రసాద్, సంక్షేమాధికారి భార్గవ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# 'రక్షణ'పై ఓసీపీల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్

శ్రీరాంపూర్, అక్టోబర్ 28: శ్రీరాంపూర్ ఓసీపీపై శనివారం 54వ రక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో సేఫ్టీ కమిటీ అధికారుల బృందం కన్వీనర్ జీఎం డీవీఎస్ సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీపీపై ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డిపార్ట్‌మెంట్లు, క్వారీ, పనిస్థలాలను సందర్శించి రక్షణ చర్యలు తనిఖీ చేశారు. రక్షణ కమిటీ కన్వీనర్ జీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు ఎల్లప్పుడు రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. రక్షణ చర్యలు పాటించడంలో శ్రీరాంపూర్ ఓసీపీ మొదటి స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది కూడా సాధించాలని కోరారు. కార్మికులంతా రక్షణ పరికరాలు వినియోగించాలని కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎస్ఈ ఆంజనేయప్రసాద్, అధికారులు వెంకటేశ్వర్లు, నరేందర్, సుధీర్ జక్కులవార్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్ సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు.

### ఇందారం ఓసీపీలో..

జైపూర్, అక్టోబర్ 28: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓసీపీని శనివారం రక్షణ తనిఖీ బృందం సందర్శించింది. 54వ వారిక్ష రక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని బృందం కన్వీనర్ జీఎం హెఆర్‌డీ కార్పొరేట్ వెంకటేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, అధికారులు, ఉద్యోగులను అభినందించారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన రక్షణ పరికరాలను యాజమాన్యం అందిస్తున్నదని, అవి వాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని తెలిపారు. ఇందారం ఓసీపీ ఉద్యోగులు, కార్మికులు క్రమశిక్షణకు మారుపేరన్నారు. అనంతరం ఉద్యోగులు రక్షణ పై ప్రదర్శించిన నాటికను బృందం సభ్యులు తిలకించి వారిని అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో రక్షణ బృందం సభ్యులు డిప్యూటీ మేనేజర్ డీ రమేశ్, డీజీఎం ఈఅండ్ఎం రామ్మోహన్, ఎన్విరాల్‌మెంట్ డిప్యూటీ మేనేజర్ (కార్పొరేట్) భాస్కర్‌రావు, జే చంద్రశేఖర్, రాజ్‌కుమార్, కొమురయ్య, బీ రవీందర్, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ , ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్లు రవి కుమార్, బ్రహ్మాజీ రావు, నాగన్న, సంక్షేమాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



జైపూర్: బహుమతి అందిస్తున్న అధికారులు

# కోలిండియా స్థాయిలో రాణించాలి

- బెల్లంపల్లి డీజీఎం(సివిల్ ) సతీశ్‌బాబు
- గోలేటిలో క్రికెట్ పోటీలు



గోలేటిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీఎం(సివిల్ ) సతీశ్‌బాబు

రెబ్బెన, అక్టోబర్ 28: సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా డీజీఎం(సివిల్) సతీశ్‌బాబు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో శనివారం డిపార్టుమెంట్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా, ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని ఓటమి గెలుపునకు నాందిగా స్వీకరించాలని, కొత్త క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏరియాలోని క్రీడాకారులు తదితరులున్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి

## మృతుల కుటుంబాలకు పరామర్శ

చిట్యాల, అక్టోబర్ 28 : మండలంలోని జూకల్ గ్రామంలో కాల్వ రవీందర్‌రెడ్డి, ఎల్దండి వెంకటేశ్వర్లు, కన్నం రాజయ్య, చిదురాల రాజీరెడ్డి వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలను శనివాం వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పరామర్శించారు. ఆమె వెంట సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీటీసీ జంబుల తిరుపతి, చాడ ఆనంద్‌రెడ్డి, కొడారి రవి తదితరులున్నారు.

## గ్రూప్ అడ్మిన్, మరొకరిపై కేసు

గణపురం, అక్టోబర్ 28 : మండలంలోని చెల్పూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు చెల్పూరు సమాచార వాట్సాప్ గ్రూప్‌లో అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన అడియోను పోస్ట్ చేసినందుకు ఎంజాల సురేశ్‌తో పాటు అడ్మిన్ జెట్టి కనకరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి శనివారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాట్సాప్ గ్రూప్‌లలో వ్యక్తిగత దూషణలు చేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై, గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్రనాథ్

## నర్సరీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

మహదేవపూర్, అక్టోబర్ 28 : మండల కేంద్రంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలోని ఖాళీ స్థలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారంలో నాటేందుకు ఎంపిక చేసిన మొక్కలను పెంచేందుకు ఏర్పాటు చేస్తున్న నర్సరీ లెవలింగ్ పనులను శనివారం ఎంపీడీవో రవీంద్రనాథ్ పరిశీలించారు. ఈ నర్సరీలో అడవి జాతి, నీడ, పండ్లు, అలంకరణ మొక్కలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ప్రసాద్, రమేశ్ తదితరులున్నారు.

## తనిఖీల్లో పట్టుబడిన నగదు అందజేత

ములుగు టౌన్, అక్టోబర్ 28 : జంగాలపల్లి క్రాస్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఈనెల 26న పట్టుపడిన రూ. 70,000 నగదును శనివారం జిల్లా ఎలక్షన్స్ గ్రీవెన్స్ కమిటీ సంబంధిత వ్యక్తులకు అప్పగించింది. నోడల్, ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ అధికారి సర్దార్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం కమిటీ ఆమోదం ద్వారా దయ్యాల చంద్రమౌళికి చెందిన రూ. 20,000, నడిపల్లి శ్రీనివాస్ రావుకు చెందిన రూ. 50,000 సంబంధించి పత్రాల పరిశీలన అనంతరం తిరిగి వారికి అప్పగించామని తెలిపారు.

## పారిశుధ్య పనులు చేపట్టాలి

మహదేవపూర్, అక్టోబర్ 28 : గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీవో ప్రసాద్ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఎల్కేశ్వరంలో పర్యటించి పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్డు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట జీపీ సిబ్బంది ఉన్నారు.